


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మా వారి గర్ల్‌ఫ్రెండ్

**తెల్లారుఝామున ఆరున్నరకి** బెల్ మోగితే ఆవులిస్తూ లేచి తలుపు తీసాను. విసురుగా లోపలికి వచ్చిన మా వారు చేతిలోని సూట్‌కేస్‌ని హాల్లో విసిరేసి, బెడ్‌రూంలోకి వెళ్ళి ధన్‌మని తలుపు వేసుకున్నారు. అది నేను నిద్రలేచే సమయం కాదు కాబట్టి సోఫాలో పడుకుని మళ్ళీ నిద్రపోయాను. ఎనిమిది గంటలకి లేచి మొహం కడుక్కుని కాఫీ తాగి, ఆఫీస్ టైమ్ అవుతోందని ఆయన్ని లేపడానికి బెడ్‌రూం తలుపు తీయగానే ఓ ఆడ కంఠం వినిపించింది. హడలిపోయి చూస్తే, మావారు చిద్విలాసంగా, పాలకడలిలోని శ్రీమహావిష్ణువులా పడుకుని, పొట్టమీద సెల్‌ఫోన్ స్పీకర్ మోడ్‌లో పెట్టి ఎవరితోనో మాట్లాడుతున్నారు. నన్ను చూడగానే ఠక్కున దాని పీక నొక్కి చెవి దగ్గర ఉంచుకుని, 'మళ్ళీ పావుగంటాగి ఫోన్ చేస్తా' అని ఫోన్ ఆఫ్ చేసారు.

"ఎవరు?" ఆరాగా అడిగాను.

"నిన్న ఓల్డ్ స్టూడెంట్ మీట్‌లో కలిసాను. నా ఫ్రెండ్ శమంత గురించి చెప్పానా నీకు?" హుషారుగా అడిగారు.

"నాతో మీరు ఎప్పుడైనా కబుర్లు చెపితే కదా తెలిసేది? నేను చెప్పినా వినరు. ఇప్పుడు ఆవిడతోనా మాటలు?" విసురుగా అడిగాను.

ఆయన అదేం పట్టించుకోకుండా అదే ఉత్సాహంతో చెప్పారు. "శమంత, నేను బి.ఎస్సీ కలిసి చదివాం. నాలాగే తను ఎం.ఎస్సీ చదివి పి.హెచ్‌డి కూడా చేసింది. విజయవాడలోనే ఫిజిక్స్ రీడర్‌గా పని చేస్తోందిట. నిన్న కలిసాను. ఇద్దరం బోలెడు కబుర్లు చెప్పుకున్నాంలే. అచ్చం అలాగే ఉంది."

"పెళ్ళి పెటాకులు, మొగుడు మొద్దులు ఏవీలేవా ఆవిడకి?" కోపంగా అడిగాను.

"వాళ్ళాయన సౌదీలో పనిచేస్తాడట. విజయవాడలో ఒంటరిగా ఉంటోంది. ఆయన అక్కడికి రమ్మంటే గవర్నమెంట్ జాబ్ వదిలేయను అని చెప్పిందిట. ఓ ఐదేళ్ళు సెలవు పెట్టిరా. తర్వాత ఇద్దరం ఇండియా వెళ్ళిపోదాం అంటాడట. వేస్ట్‌ఫెలో. రంభలాంటి భార్యని వదిలి ఎలా వెళ్ళాడో. డబ్బులు ముఖ్యం కాదని వాడికి ఎప్పుడు తెలుస్తుందో!"

నేను విస్ఫారిత నేత్రాలతో ఆయనవైపు చూస్తూండిపోయాను. అరిగిపోయిన సబ్బుముక్కని కొత్త సబ్బుకి అతికించకుండా పారేసానని నాతో నాలుగు రోజులు మాట్లాడని మనిషేనా ఈ మాటలు చెప్పేది.

"ఈవిడ గవర్నమెంట్ జాబ్ వదిలి రాను అనడం డబ్బుకోసం కాదా? సేవా దృక్పథమా?" అడిగాను.

"ఆపు. వచ్చాక నిద్రపోలేదు. సాయంత్రం త్వరగా వస్తా" ఆయన సెల్ ఫోన్ ఛార్జర్‌ని బేగ్‌లో సర్దుకుంటూ చెప్పారు.

"అదేం అలవాటు కొత్తగా?" అడిగాను.

"ఫోన్ పాతదైపోయింది. ఛార్జ్ సరిగ్గా ఉండటంలేదు. ప్రతీది నీకు చెప్పాలా?" విసుక్కున్నారు.

"ఈ రెండు రోజుల్లోనే అంత పాతదైపోయిందా?" ఆశ్చర్యపోయాను.

"అవును. నీ యక్ష ప్రశ్నలాపుతావా?" కోపంగా వెళ్ళిపోయారు.

సాయంత్రం ఆరింటికల్లా ఇంటికి వచ్చి బెడ్రూంలోకి వెళ్ళి తలుపుని ధామ్మని వేసుకున్నారు. నా పనులన్నీ పూర్తయి, పిల్లలతో ఫోన్‌లో మాట్లాడి, ఆయన్ని భోజనానికి పిలుద్దామని వెళ్ళాను.

అదే దృశ్యం! పొట్టమీద ఫోన్. శ్రీమన్నారాయణుడి పోజ్.

"తలుపు తట్టిరావాలి" కోపంగా చెప్పారు.

"ఎప్పటినించి ఈ మేనర్స్?"

"ఇప్పటినించే.. మా ఆవిడ వచ్చింది. తర్వాత మాట్లాడతా." ఫోన్ కట్ చేసి అడిగారు.

"ఏమిటి?"

"భోజనం."

"వడ్డించి పిలు."

"వడ్డించే వచ్చా."

"పద"

రోజూ పదినిమిషాల్లో తినే ఆయన ఈరోజు ఐదునిమిషాల్లో తినేసారు. ఆరో నిమిషంలో బెడ్రూంలోకి వెళ్ళి తలుపు మూసుకున్నారు.

నా సర్దుళ్ళు ముగించి తలుపు మీద తట్టి లోపలకి వెళ్ళాను. ఆయన ఫోన్ తీసుకుని బాల్కనీలోకి వెళ్ళడం గమనించి అడిగాను.

"పిల్లల రూం ఖాళీగానే ఉందిగా. అక్కడికెళ్ళి పడుకోనా?"

"అక్కర్లేదు" అనవసరమైన ఆగ్రహాన్ని ప్రదర్శించారు.

అర్థరాత్రి మెలుకువ వచ్చి చూస్తే పక్కన ఆయనలేరు. చూస్తే సోఫాలో పడుకుని ఉన్నారు. నిశ్శబ్దంగా వెనక్కి వచ్చేసాను.

"రాత్రి నేను పిల్లల రూంలో పడుకుంటా అంటే వద్దని, మీరు సోఫాలో పడుకున్నారేంటి? అసలే నిన్న బస్ ప్రయాణం, పగలుకూడా పడుకోలేదు" సానుభూతిగా అడిగాను. బ్రేక్‌ఫాస్ట్ పెడుతూ.

"ఒకరాత్రివేళ బాల్కనీలో చలేసింది. అందుకని హాల్లోకి వెళ్ళాను" సంజాయిషీగా చెప్పారు.

"మీరిద్దరూ ప్రేమికులేంటి? మీకో ప్రేమకథ ఉందన్నమాట. ఇంతకాలం నించి చెప్పలేదే?" ఆసక్తిగా అడిగాను.

"ఛఛ! అప్పుడసలు మేమిద్దరం మాట్లాడుకోలేదు. మొన్న మా ఓల్డ్ స్టూడెంట్ మీట్‌కి మా క్లాస్‌మేట్స్ ఎక్కువ మంది రాలేదు. శమంత ఒక్కటే తెలిసిన మొహం దాంతో ఇద్దరం కుర్చుని మాట్లాడుకున్నాం."

"అమ్మయ్యా! ఇది పాసింగ్ క్లౌడ్ నేను ఆదుర్దా పడక్కర్లేదు" నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాను.

ఆయన ఆఫీస్‌కి వెళ్తూ ఛార్జర్ బేగ్‌లో పెట్టుకోవడం మాత్రం మర్చిపోలేదు.

అసలే మితభాషి అయిన ఆయన నాతో మాట్లాడటం పూర్తిగా తగ్గిపోయింది. నేను మెలుకువగా ఉండగా వచ్చి నా పక్కన పడుకోవడం లేదు. రాత్రిపూట భోజనం చేయగానే ఫోన్ పట్టుకుని బాల్కనీలోకి వెళ్ళిపోతున్నారు. ఒకటి రెండుసార్లు పిలుద్దామని వెళ్ళాను మంద్రమైన గొంతుతో ఆయన మాటలు వినపడగానే ఇక ఆ ఆలోచన మానేసాను. నా ముప్పై రెండేళ్ళ వైవాహిక జీవితంలో ఆ కంఠం నేను వినలేదు.

మాట్లాడకపోవడం, ఏదీ పట్టించుకోకపోవడం, బొత్తిగా సరసం అన్నది తెలియకపోవడం అన్నీ ఆయన సహజ లక్షణాలని ఈ ముప్పైరెండేళ్ళుగా అమాయకంగా నమ్మాను. అది అబద్ధం అని అర్థమైంది.

"ఆ రోజు తోపు రంగు చీరలో నువ్వెంత బావున్నావో? సంధ్యారాగంలా ఉన్నావు."

ఓ ఆదివారం రోజు నేను బట్టలు ఆరేయడానికి బాల్కనీలోకి వెళ్తే ఫోన్‌లో గుసగుసగా చెప్పడం వినిపించింది.

ఈ కాలం పిల్లల భాషలో చెప్పాలంటే నాకు కాలింది. పెళ్ళయిన కొత్తల్లో ఓసారి శ్రద్ధగా తయారై, పేపర్ చదువుకుంటున్న ఆయన దగ్గరకి వెళ్ళి అడిగాను.

"ఎలా ఉన్నాను.?"

"బావున్నావ్" పేపర్లోంచి తలెత్తకుండా చెప్పారు.

"నా మొహం ఎలా ఉంది?" ఉక్రోషంగా అడిగాను.

"బావుంది. బొట్టు కొద్దిగా పెద్దదైనట్లుంది."

నేను అతి చిన్న బొట్టు పెట్టుకున్నాను.

ఆయన కళ్ళు మూసి అడిగాను.

"నేను కట్టుకున్న చీర ఏ రంగు?"

"నీలం"

"నేను కట్టుకున్నది పసుపుపచ్చ" చేతులు తీసి అరిచాను.

"ఏదో ఒకటి. నాకు అన్నీ ఒకేలా కనిపిస్తాయి. ఇందిరాగాంధీ హత్య గురించి ఇంట్రెస్టింగ్ న్యూస్ చదువుతూంటే, ఏంటి నీగోల?" నాకంటే పెద్దగా అరిచారు.

ఇప్పుడు సంధ్యారాగం అంటూ కవిత్వాలు.. నాకు ఉక్రోషంతో కన్నీళ్ళు వచ్చాయి.

ఆ రాత్రి భోజనాల దగ్గర అడిగాను.

"తోపు రంగు అంటే ఏ రంగండీ?"

"నీకెందుకు?" అనుమానంగా అడిగారు.

"ఎప్పుడూ వినలేదు. విబ్‌జియార్‌లో లేని రంగేమో అని."

"అంటే మెరూన్ కలర్. అలాంటి రంగు." కిటికీ కర్టెన్ చూపించి చెప్పారు.

"మీకు అన్నిరంగులు ఒకేలా కనిపిస్తాయని నవంబర్ మూడు 1984లో చెప్పారుగా?" నిలదీసాను.

"నాకంటే ఇందిరాగాంధీ హత్యావార్తలు ఎక్కువన్నారు గుర్తుందా?" అంతే ఆయన మొహం వికృతంగా మారింది.

"అందుకే నువ్వంటే నాకు అసహ్యం. ఎప్పటివో విషయాలు తారీకులతో సహా గుర్తుపెట్టుకుని సాధిస్తావు" టేబుల్ మీది నెయ్యిగిన్నెని ఓ మూలకి విసిరికొడుతూ అరిచారు.

అది పట్టించుకోకుండా మృదువుగా చెప్పాను.

"జయలలిత నిజంగా జబ్బుచేసి పోయిందా లేక హత్యా అని పేపర్లో చాలా ఇంట్రెస్టింగ్ న్యూస్ వస్తున్నాయి. మీరసలు పేపరే చదవడంలేదు."

"ఛ"

ఆయన కంచం విసిరికొట్టి లేచి వెళ్ళిపోయారు. నేను నవ్వుకుని తాపీగా, కడుపునిండా తిని లేచాను.

"మా ఆవిడతో చిన్నగొడవైంది.." ఫోన్‌లో ఆయన చెప్తున్న మాటలు వినిపించాయి.

"బేబీ రాత్రి ఎనిమిది గంటల ఫ్లయిట్‌లో వస్తోంది" చెప్పాను.

"సరే. ఆరింటికల్లా బయలుదేరదాం... మా అమ్మాయి రాత్రి ఎనిమిదింటి ఫ్లయిట్‌కి వస్తోంది. ఏర్‌పోర్ట్ కి వెళ్దామని చెప్తోంది." కొంచెం నాతో, మిగిలింది. ఫోన్‌లో చెప్పారు మావారు.

ఈమధ్య ఆయనకి బాల్కనీలో నుంచుని, నుంచుని కాళ్ళు నొప్పులు మొదలయ్యాయి. దాంతో నా పక్కనే పడుకునే ఫోన్‌లో మాట్లాడటం. ఛాటింగ్ చేయడం చేస్తున్నారు. పిల్లల రూంలో వైఫై సరిగా రావడం లేదుట పాపం ఒకసారి ఒకే అమ్మాయి అనే పాలసీని కూడా పాటిస్తున్నారు పాపం. నన్ను చిటికెన వేలితో కూడా ముట్టుకోవడంలేదు.

"శారీరక వ్యభిచారం కంటే, మానసిక వ్యభిచారం ఇంకా చెడ్డది, అది అక్కడితో ముగిసిపోతుంది. దీన్ని మనసు మోస్తూనే ఉంటుంది." ఓసారి రాత్రి రెండుగంటలప్పుడు చెప్పాను.

వారం రోజులు నాతో మాట్లాడలేదు. ఎనిమిదో రోజు చెప్పారు.

"నువ్వు నన్ను అపార్థం చేసుకుంటున్నావు. మేము జస్ట్ ఫ్రండ్స్‌మే అంతకు మించి ఏమీలేదు."

"అవునా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును. జస్ట్ ఫ్రండ్స్. ఏవో కాలేజీ రోజుల కబుర్లు చెప్పుకుంటున్నాం. అంతే. తను వంటరిగా ఉంటోంది పాపం."

నాకు నవ్వొచ్చింది. నా వంటరితనాన్ని ఎవరు తీరుస్తారు?

రెండు నెలల తర్వాత ఆపుకోలేని ఆవేశంతో ఆవిడ నంబర్‌కి మెసేజ్ ఇచ్చాను.

"మీరు మావారితో మరీ ఎక్కువసేపు మాట్లాడుతున్నారు. దాని అర్థం నా సమయాన్ని దొంగతనం చేస్తున్నారు."

ఆ సాయంత్రం మావారు శివతాండవం చేసారు. తమ స్నేహాన్ని అపార్థం చేసుకున్న కుసంస్కారి అన్నారు. ఆవిడ పొద్దుటినించి ఏడుస్తూనే ఉంది అన్నారు. ఇంకా చాలా అన్నారు. నాకు అర్థమైన విషయం ఒక్కటే. ఇది పాసింగ్ క్లౌడ్ కాదు. కారుమబ్బు, అప్పటినించి ఆయన్ని పట్టించుకోవడం మానేసాను. ఒక ఇంట్లో నివశిస్తున్నా రోజు మొత్తంలో రెండు మూడు మాటల కంటే ఎక్కువ సంభాషణ జరగడంలేదు మా మధ్య.

మా అమ్మాయిని రిసీవ్ చేసుకుని ఏర్‌పోర్ట్‌నించి ఇంటికి వస్తున్నాం.

"మా అమ్మాయి వచ్చింది. తను ఢిల్లీలో రీసెర్చ్ చేస్తోందిగా. వారం రోజులు సెలవులు వచ్చాయని వచ్చింది.." ముందు సీట్లో కూర్చున్న ఆయన యధాప్రకారం ఫోన్‌లో చెప్తున్నారు.

"ఎవరు?" అన్నట్లుగా మా అమ్మాయి కళ్ళెగరేసింది.

"నువ్వే అడుగు" నెమ్మదిగా చెప్పాను.

"అమ్మో! నాన్నని అడగాలా? ఇంకా నయం" గొణిగింది.

"మా అమ్మాయి ఇప్పుడే లేచింది. మొహం కడుక్కుని కాఫీ తాగుతోంది..." మావారి రన్నింగ్ కామెంటరీ కొనసాగుతోంది.

"ఏంటీ? నాన్న ఆటో బయోగ్రఫీ రాయించుకుంటున్నారా?" మా అమ్మాయి గుసగుసలాడింది.

నాకు నవ్వొచ్చింది.

"నువ్వే కనుక్కో" చెప్పాను.

"అవతలి వైపు మాట్లాడేది లేడీ అని పందెం." నన్ను జాలిగా చూస్తూ చెప్పింది.

"అవును శమంతక మణి అని నాన్నకి బి.ఎస్సీలో ఫ్రండ్" చెప్పాను. కిసుక్కున నవ్వింది. నేనూ నవ్వాను. కనీసం నవ్వినట్లు నటించాను. సెలవులు పూర్తయి వెళ్ళేముందు మా అమ్మాయి చెప్పింది.

"అమ్మా! నేనేం చిన్న పిల్లని కాదు. నాకు ముప్పై ఏళ్ళు. నాన్న స్పాయిల్ అయ్యారు. అదే శమంతకమణి శమంతకరావు అయితే అంత టైం స్పెండ్ చేసేవాళ్ళా? సెవన్ ఇయర్ ఇచ్ థర్టీత్రీ ఇయర్స్‌కి వచ్చినట్లుంది. జాగ్రత్త."

"ఏం జాగ్రత్త పడమంటావు?" అడిగాను.

తెల్లమొహం వేసింది.

"మీ నాన్న విజయవాడ వెళ్తాను అన్నప్పుడు ఆలోచిస్తా. ప్రస్తుతానికి ఏం ప్రమాదం లేదులే." చెప్పాను.

వారంనించి ఆయన చాలా అశాంతిగా ఉండటం గమనిస్తున్నాను. ఫోన్లు, వాట్సప్ ఛాటింగ్స్ ఆగిపోయాయి. ఆయనకేం తోచడం లేదు. పిచ్చిపట్టినట్లుగా టి.వి ఛానల్స్ మారుస్తూ చూస్తున్నారు కాని ఏకాగ్రత ఉండటం వేరు.

"ఏం జరిగింది? ప్రణయకలహమా?" ఊరుకోలేక ఆ రాత్రి అడిగాను.

"మళ్ళీ అదేమాట? మేము ప్రేమికులం కాదు" ఖస్సుమన్నారు.

"పోనీ మంచి స్నేహితులు. మీది అమలిన స్నేహం. చెప్పండి. ఏం జరిగింది?" అనునయంగా అడిగాను.

దగ్గరకి జరిగి, దాదాపు నాలుగు నెలల తర్వాత నా మీద చేతిని తీసి చెప్పారు.

"వాడు వచ్చేసాడు."

"ఎవరు? మీ ప్రే...సారీ స్నేహగాథలో విలన్ కూడా ఉన్నాడా?" అడిగాను.

"శమంత వాళ్ళాయన. సౌదీని శాశ్వతంగా వదిలి వచ్చేసాడు."

"వస్తే?"

"ఇంక తనేం మాట్లాడుతుంది?"

"ఏం ఫోన్ లాక్కున్నాడా?"

"ఛ! లేదు. భర్త పక్కన ఉంటే ఎలా మాట్లాడుతుంది?"

ఒక్క ఉదుటున లేచి కూర్చుని ఆయన వంక సూటిగా చూస్తూ అడిగాను.

"ఇన్ని నెలలు నేను పక్కన ఉండగానే మాట్లాడరుగా? మరి ఆయన పక్కన ఉంటే మాట్లాడడానికి ఆవిడకేంటి అభ్యంతరం?"

ఈ రోజుకీ మా వారి నుంచి దానికి సమాధానం రాలేదు. వస్తుందని కూడా నేను అనుకోవడంలేదు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments